క్లుప్తంగా

అయ్యప్పకు బంగారపు బొట్టు బహూకరణ



అయ్యప్పస్వామికి బంగారపు బొట్టును బహూకరించిన దాతలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి వారి క్షేత్రంలో స్వామివారికి దాతలు బంగారపు బొట్టు బహూకరించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన తిరువీధి వేణుగోపాల్, వరలక్ష్మీ దంపతులు, వారి కుమార్తె స్వాతిక, శ్రీకర్ దంపతులు ఈ బంగారపు బొట్టును ఆలయానికి అందజేశారు. అర్చకులు బొట్టును స్వామి వారికి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

హైస్కూల్‌లో వాటర్ షెడ్ నిర్మాణం



పరింపూడి బాలికోన్నత పాఠశాలలో నిర్మించిన వాటర్ షెడ్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం రోటరీ క్లబ్, పూర్వ విద్యార్థుల ఆర్థిక సౌజన్యంతో పరింపూడి బాలికోన్నత పాఠశాలకు వాటర్ షెడ్డు సమకూరింది. హెచ్‌ఎం ఉమాదేవి ఆధ్వర్యంలో శనివారం ఈ వాటర్ షెడ్‌ను ప్రారంభించారు. హైస్కూల్‌లోని వాటర్ ప్యూరిఫైమెషీన్‌కు రక్షణ లేకపోవడంతో రోటరీ క్లబ్, పూర్వ విద్యార్థులు రూ.15 వేల వ్యయంతో షెడ్ నిర్మించి అందజేశారు. 1985–86 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు, రోటరీ క్లబ్ సభ్యులు కొంపెల్లి వరప్రసాద్‌రావు, ఐటీడీఏ రిటైర్డ్ ఎంఈఓ ఎస్‌కే అమీర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి బాబ్జి రాజీనామా

కొయ్యలగూడెం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జుంగా బాబ్జి ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు శనివారం పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని ఏలూరు జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌కి ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఏఎంసీ మాజీ చైర్మన్ జెట్టి గురునాధరావు రాజీనామా చేసిన నేపథ్యంలో తాను కూడా ఆయన బాటలో నడవనున్నట్లు చెప్పారు. గురునాధరావు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి నూతన పార్టీలోకి చేరతానని తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: అలివేరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుంజా కన్నయ్య, దుర్గమ్మ కుటుంబానికి జీసస్ లవ్ ఇన్ కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక డైరెక్టర్ కె.గాబ్రియేల్, కె.విక్టోరియా ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ.10000 నగదు, వంట సామాగ్రిని అందించారు. కార్యక్రమంలో కె. పాల్, సైమన్, జోసెఫ్ పాల్గొన్నారు.

కామవరంలో జాతర



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కామవరంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ, దుర్గమ్మ తల్లి, గద్దెరాజుల జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు గద్దెరాజులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. మాఘశుద్ధ పౌర్ణమి రోజున ప్రారంభమయ్యే ఈ జాతర 29వ తేదీ వరకూ నిర్వహిస్తామని ఆలయ పూజారి వర్స పుల్లారావు తెలిపారు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన మినీ వ్యాన్ పంపిణీ



మినీ వ్యాన్‌ను లబ్ధిదారుడికి అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మినీ వ్యాన్‌ను లబ్ధిదారుడికి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అందజేశారు. జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారుడైన ఎ.పోలవరం గ్రామానికి చెందిన నాగరాజుకు రూ.15 లక్షలు విలువ చేసే మినీ వ్యాన్ తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ బుద్దాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్
- జంగారెడ్డిగూడెంలో ఆసరా చెక్కుల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జగనన్న ప్రభుత్వం.. ప్రజల ప్రభుత్వం అని వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు నీరు–మీరు పనుల్లో కోట్లాది రూపాయలు దోచుకున్నారని. కేవలం మహిళలను ఓటు బ్యాంకుగా చేశారని ధ్వజమెత్తారు. జగనన్న మాత్రం మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా ఆర్థిక విప్లవం తెచ్చారన్నారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి నేరుగా వారి అకౌంట్‌లలో నగదుమ జమ చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం సోమరిపోతులను చేస్తున్నారని ఇప్పటివరకు ప్రచారం చేశారని, తీరా ఎన్నికలు వచ్చేసరికి వారు కూడా పథకాలు అమలుచేస్తామని బూటకపు మాటలు చెబుతున్నారన్నారు. చంద్రబాబు 600 హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని విమర్శించారు.



జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న కారుమూరి సునీల్ యాదవ్, కంభం విజయరాజు, బత్తిన లక్ష్మి తదితరులు



వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పండగలా ఆసరా కార్యక్రమం

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ఒక పండుగలా జరుగుతుందన్నారు. మహిళా సాధికారిత కోసం జగనన్న ఎంతో కృషిచేస్తున్నారని చెప్పారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి డిజిటల్ విద్య, కార్పొరేట్ విద్య, ఇంగ్లీష్ మీడియం విద్య జగనన్న అందిస్తున్నారన్నారు.

మహిళా పక్షపాతి జగన్

మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారిత అనేది కేవలం ఎన్నికల మాటగా మిగిలేదని, దానిని సీఎం జగన్ రూపుమాపారన్నారు. చట్టసభల్లో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించారని చెప్పారు. మహిళా పక్షపాతిగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకునేందుకు ప్రతి మహిళా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కాసర తులసి, వైద్య విభాగం జిల్లా కార్యదర్శి కఠారి సీతారాం బాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సాయిల స్వాతి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ సాయి జ్యోతిక, పట్టణ యూత్ అధ్యక్షుడు కాసర బన్ని, ఏఎంసీ వైస్‌చైర్మన్ తాతకుంట్ల రవికుమార్, పామర్రు పరిశీలకులు మండవల్లి విజయసారధి, మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, పంతగాని వెంకన్న, గురజాల పార్థసారధి,, ఎండీ హఫీజ్, చిత్తపూరి శేఖర్, మెప్మా ప్రతినిధులు నాగమణి, రాధ, కమిషనర్ భవానీ ప్రసాద్, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం

జంగారెడ్డిగూడెం: శ్రీ నూకాలమ్మ దేవస్థానంలో మాఘ పూర్ణిమను పురస్కరించుకొని 60వ చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గణపతి పూజ, సంకల్పం అర్చక స్వాములు మనోజ్ శర్మ బృందం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన చండీయాగంలో పలువురు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ యాగశాలలో చండీ పరదేవతకు పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు హోమ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

విజయదుర్గమ్మకు పల్లకి సేవ

పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా విజయదుర్గమ్మ, మరకత లింగేశ్వరస్వామికి అర్చకులు సుదర్శన వేణుగోపాలచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. పట్టణానికి చెందిన సీమకుర్తి వెంకట సత్య సుబ్బారావు, పద్మ దంపతులు అమ్మవారికి 150 గ్రాముల వెండి కిరీటం అలంకరించి పూజలు చేశారు. అలాగే పట్టణ శివారులోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దత్త ఆశ్రమంలో దత్త హోమం పూజలు నిర్వహించారు.

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం: పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తణుకు, సిద్ధాంతం, దొంగరాయిపాలెం, పాలకొల్లు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వేగేశ్న రామచంద్రరాజు, సంధ్యారాణి దంపతులు, తేజ పవన్, లయ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఉప్పల గంగాధర్, అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డిరంగప్రసాద్, కంది బాలకృష్ణ రెడ్డి, వాసవిశాయి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో పూజలు

బుట్టాయగూడెం: కామయ్యపాలెంలో శనివారం కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉప్పల లలితకుమారి, రాంపండు దంపతులు, పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

జంగారెడ్డిగూడెం: గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో కె.అద్దయ్య శనివారం విలేకరులకు తెలిపారు. మొత్తం 13 పరీక్షా కేంద్రాల్లో 3519 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల కల్లా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 10.15 గంటలు దాటితే పరీక్షా హాల్‌లోకి అనుమతించేది లేదన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరమే పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తామన్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల, శ్రీరామచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్, జెడ్పీహెచ్ బాలుర హైస్కూల్, ఉప్పలమెట్ట గురుకుల పాఠశాల, శ్రీచైతన్య స్కూల్, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, విద్యావికాస్ పాఠశాల, మండలంలోని వేగవరం నోవా ఇంజనీరింగ్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, ఫార్మసీ కాలేజ్, లక్కవరం జెడ్పీ హైస్కూల్, బుట్టాయగూడెం జూనియర్ కాలేజ్‌లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రతిపక్షాలకు అభివృద్ధి కనబడకపోవడం విడ్డూరం

రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వనిత



ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ వద్ద సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని, ప్రతిపక్షాలకు అభివృద్ధి కనబడకపోవడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వారకాతిరుమలలో ఏపీ ట్రాన్స్‌కో నిధులు రూ.62 లక్షలతో పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి వసంత్‌నగర్ కాలనీ వరకు నిర్మించిన సీసీ రోడ్డును, యాదవ కాలనీ నుంచి హర్షవనం వరకు నిర్మించిన బీటీ రోడ్డును, అలాగే తిమ్మాపురం ఎస్సీ కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ. 44.47 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఆమె రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత

ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధికి జగనన్న అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్లలో జరిగిందని ఆమె స్పష్టం చేశారు. నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. పెద్దఎత్తున సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రామప్రభ, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, దాకారపు బంగారమ్మ, వామిశెట్టి పావనీకుమారి, స్థానిక ఎంపీటీసీలు రుద్ర నాగ సూర్యకళ, పెద్దిరెడ్డి రమ్య కుసుమ, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పెద్దిరెడ్డి పద్మ జ్యోతి శ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, యిమ్మడి నాగు, యిమ్మడి శ్రీనివాసరావు, రుద్ర శివాజీ, ములకాల పానకాలు, చెన్నూరి రామకృష్ణ, చిలుకూరి చంద్రశేఖర్, ఆచంట బన్ను, బోళ్ల శ్రీను, ఘంటా శేఖర్, చవల రాంబాబు, పిట్టా వెంకటేశ్వరరావు, కొనకళ్ల పండు, కొత్తపల్లి వెంకన్న, ముళ్లపూడి రాంబాబు, కొత్తపల్లి దుర్గారావు, పెండ్లి సుధాకరరావు, బోళ్ల కిషోర్, పాకలపాటి రమేష్, నల్లంటి రామారావు తదితరులున్నారు.

సంక్షేమ పాలనకు జగన్‌ను గెలిపించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు



శ్రీనివాసపురంలో పర్యటించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో శనివారం ఆయన పర్యటించారు. ప్రజాప్రతినిధులను, వైఎస్సార్‌సీపీ శ్రేణులను, స్థానిక ప్రజలను విజయరాజు కలుసుకుని పరిచయం చేసుకున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్టీ శ్రేణులతో సమావేశమై రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందన్నారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న సంక్షేమం పథకాలు మున్ముందు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. నియోజకవర్గ ప్రజలంతా తనను ఆశీర్వదించి గెలిపిస్తే చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



జాజులకుంటలో సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: నాడు టీడీపీ హయాంలో జన్మభూమి కమీటీల పేరుతో దోపిడీ పాలన జరిగితే.. నేడు వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని జాజులకుంట, గుణ్ణంపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో శనివారం విస్తృతంగా పర్యటించిన ఆమె ఆయా గ్రామాల్లో పార్టీ నేతలతో కలసి సమావేశాలను నిర్వహించారు. అంతకు ముందు ఆమె జాజులకుంటలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, అలాగే బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని ప్రాంతాలతో పాటు అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందడమే కాకుండా, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు చేరువ అయ్యాయన్నారు. మన బిడ్డలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలన్నా, మన సమస్యలు, కష్టాలు తీరాలన్నా వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని, అలాగే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను, రాజమండ్రి ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, చెలికాని బుల్లియ్య, బొండాడ వెంకన్నబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రామప్రభ, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, తదితరులున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం



కొయ్యలగూడెంలోని సురక్ష హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని సురక్ష హాస్పటల్‌లో శనివారం ఆరోగ్యశ్రీ సేవలను స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి ప్రముఖ వైద్యులు ఎన్ఎస్ రామరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని పలు విభాగాలను అతిథులతో కలిసి ప్రారంభించారు. ఆరోగ్య శ్రీ పథకం మరింత బాధ్యతను పెంచిందని, ప్రతి బుధవారం గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ కొండముది దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు ఎస్తేరు రాణి, తస్లీమా, సచివాలయాల మండల కోఆర్డినేటర్ నూకల రాము, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ మట్టా వనజా లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం డీఎస్పీగా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ



యు.రవిచంద్ర, డీఎస్పీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డీఎస్పీగా యు.రవిచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పల్నాడు జిల్లా నరసరావుపేట దిశ డీఎస్పీగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎం.ధనుంజయుడును డీవోడబ్ల్యూ - 2 (ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్)కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సబ్ డివిజన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు కృషిచేస్తామన్నారు.

మద్ది క్షేత్రంలో పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రవిచంద్ర శనివారం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు డీఎస్పీకి శేష వస్త్రాన్ని కప్పి సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: ఆరిపాటి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన వంగల వెంకట సత్యనారాయణ(24) బైక్ పై మరో ఇద్దరు స్నేహితులతో ఐఎస్ జగన్నాధపురం తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తూ ఆరిపాటి సమీపంలో బైక్ అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ ప్రాణాలు కోల్పోగా బైక్ పై ఉన్న మిగిలిన ఇద్దరు గాయపడినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



నేతాజీ వేషధారణలో నిటలాక్షరామ



అందుకున్న మెడల్, ప్రశంసా పత్రం

కొయ్యలగూడెం: కొయ్యలగూడేనికి చెందిన చిన్నారి నిటలాక్షరామ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. కొయ్యలగూడెంకి చెందిన జ్యోతిష్య నిపుణులు దాసరోజు శ్రీనివాసరావు, రసజ్ఞ దంపతులైన మూడేళ్ల చిన్నారి గతేడాది 75వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ వేషధారణతో చిన్నారి ఆకట్టుకున్నాడు. ఈ పోటీల్లో 20,348 మంది చిన్నారులు పాల్గొనగా, తమ కుమారుడికి రికార్డ్స్ బుక్‌లో స్థానం దక్కినట్లు తల్లిదండ్రులు తెలిపారు. నిటలాక్షరామ రాజమండ్రిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్నట్లు వారు తెలిపారు. నిటలాక్షరామ గతంలో సంస్కృత శ్లోకాల పఠనానికి జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి వనిత పరామర్శ



నాగేశ్వరరావును పరామర్శిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: ఇటీవల టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ మండలంలోని గుండుగొలనుకుంట సొసైటీ చైర్‌పర్సన్ గోపా నాగేశ్వరరావును రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత శనివారం పరామర్శించారు. ముందుగా ఆమె నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. నేనున్నానంటూ ఆయనకు భరోసానిచ్చారు. అన్యాయంగా ఎవరైనా వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు తెగబడితే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. తమను హత్య చేసేందుకు ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్టు చేసి, తమకు న్యాయం జరిగేలా చూడాలని నాగేశ్వరరావు మంత్రి వనితను కోరారు. అనంతరం ద్వారకాతిరుమలకు చేరుకున్న మంత్రి వనిత తల్లిని కోల్పోయిన వైఎస్సార్ సీపీ నేత పొనమాల ఉమామహేశ్వరరావు, నాగరాజులను పరామర్శించారు. అనంతరం తండ్రిని కోల్పోయిన తిరుమలంపాలెంకు చెందిన మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషాను పరామర్శించారు.

మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి



బొర్రంపాలెం ఎంఆర్‌సీ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సామంతపూడి

టి.నరసాపురం: మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్రప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) అన్నారు. మండలంలోని బొర్రంపాలెం ఎంఆర్‌సీ కాలనీలో రూ.40 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న డ్రెయిన్‌లు, సీసీరోడ్ల నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా సామంతపూడి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి లేక ఎంఆర్‌సీ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మొదలుపెట్టిన పనులు కరోనా కారణంగా నిలిచిపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోవడం జరిగిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటనలో గ్రామస్తులు సమస్యలను విన్నవించారన్నారు. దీంతో అప్పట్లో సమస్యలన్నీ పూర్తి చేసిన తరువాతే ఓటు అడగడానికి వస్తామని బాలరాజు చెప్పారని, ఆయన అన్న విధంగానే రూ.40 లక్షల జెడ్పీ నిధులతో సీసీ, రోడ్లు డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇది ఓటు రాజకీయం కాదని, ఇచ్చిన మాటని నిలబెట్టుకోవడం కోసమే ఇక్కడికి వచ్చామని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్ బాబు, కలపర్తి రామకృష్ణ, తోట గంగాధర్, కలపర్తి మునీశ్వరరావు, ఉమ్మడి తేజ, మాణిక్యాలరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం



కల్యాణమోములో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి

కామవరపుకోట: కామవరపుకోటలో కొలువైన భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామివారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. ఈ కల్యాణ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శనివారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్ని శివాలయాల్లో శివరాత్రి సమయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తుండగా, అందుకు భిన్నంగా తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే స్వామివారి కల్యాణం పౌర్ణమి వెన్నెలలో నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. అనంతరం శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కొయ్యలగూడెం: ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం శనివారం కొయ్యలగూడెంలో నిర్వహించారు. వైద్య, ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి వంద మందికి పైగా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అతి శక్తివంతమైన ఆయుధం అని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సందీప్, సల్మాన్, సీడీపీవో పి.బ్యూలా, సూపర్‌వైజర్ కె.లక్ష్మి, ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.